ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

జాతీయ వార్తలు

తేదీ: 07.11.2024 సమయం: 19.05 గంటలు

ముఖ్యాంశాలు

1. భారతదేశం, అమెరికా భాగస్వామ్యం బహుముఖ భాగస్వామ్యమని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

2. దేశంలో ఉగ్రవాదాన్ని దీటుగా ఎదుర్కొనేందుకు జాతీయ ఉగ్రవాద వ్యతిరేక వ్యూహాన్ని ప్రభుత్వం త్వరలో అమలు చేస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు.

3. ప్రభుత్వ ఉద్యోగ నియమకాల్లో నియమ, నిబంధనలను మధ్యలో మార్చలేమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ ధర్మాసనం స్పష్టం చేసింది.

4. ఈరోజు దేశ వ్యాప్తంగా జాతీయ క్యాన్సర్ అవగాహనా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

## REV. MEA-BRIEFING

భారతదేశం, అమెరికా మధ్య భాగస్వామ్యం బహుముఖ భాగస్వామ్యమని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈరోజు న్యూఢిల్లీలో మీడియాతో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. ఆ దేశ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడి, ఇరు దేశాల మధ్య సమగ్ర ప్రపంచ, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఎదురుచూస్తున్నట్లు తెలియజేసారు. భారత్, అమెరికాలు ప్రజల అభివృద్ధికి, శాంతి భద్రతలకు పాటుపడతాయని జైశ్వాల్ చెప్పారు. కాగా, కెనడాలోని టొరంటోలో జరగవలసిన కొన్ని కాన్సులర్ క్యాంపుల రద్దుపై, జైస్వాల్

మాట్లాడుతూ... కెనడా ప్రభుత్వం నుండి తగిన భద్రత హామీ లభించనందున ఈ శిబిరాలను రద్దు చేశామని చెప్పారు. కెనడాలోని బ్రాంప్టన్ లోని ఒక ఆలయంపై దాడి ఘటనపై జైస్వాల్ మాట్లాడుతూ, ఈ దాడిని భారత్ ఖండించిందన్నారు. ఆఫ్ఘనిస్తాన్‌కు అందించిన మానవతా సహాయంపై మాట్లాడుతూ... ఆఫ్ఘనిస్తాన్‌కు 50 వేల మెట్రిక్ టన్నుల గోధుమలు, 300 టన్నుల మందులు, 28 టన్నుల భూకంప సహాయక సామగ్రిని అందించినట్లు విదేశీ వ్యవహారాల ప్రతినిధి తెలిపారు.

## DAY AMIT SHAH:

దేశంలో ఉగ్రవాదాన్ని ధీటుగా ఎదుర్కొనేందుకు, ఉగ్రవాద వ్యతిరేక వ్యవస్థను నిర్మించేందుకు జాతీయ ఉగ్రవాద వ్యతిరేక విధానం, వ్యూహాన్ని ప్రభుత్వం త్వరలో అమలు చేస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ నిర్వహించిన రెండు రోజుల ఉగ్రవాద వ్యతిరేక సదస్సులో అమిత్ షా మాట్లాడుతూ... గత దశాబ్ద కాలంలో ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఉగ్రవాద నిర్మూలనకు పటిష్టమైన వ్యవస్థను ప్రభుత్వం రూపొందించిందని అన్నారు. ఉగ్రవాదాన్ని ఎంతమాత్రం ఉపేక్షించకూడదన్న నరేంద్రమోదీ పిలుపుకు ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయని అన్నారు. గడిచిన పదేళ్లలో ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు దేశంలో పటిష్టమైన ఉగ్రవాద వ్యతిరేక వ్యవస్థను ఏర్పాటు చేశామని అమిత్ షా వెల్లడించారు.

## REV. EVE JHARKHAND CAMPAIGNING

జార్ఖండ్ శాసనసభ ఎన్నికల్లో NDA, ఇండి కూటమిల నాయకులు మొదటి దశ పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ఎన్నికల సభల్లో ప్రసంగిస్తున్నారు. బిజెపి సీనియర్ నాయకురాలు, కేంద్ర మంత్రి అన్నపూర్ణా దేవి హజారీబాగ్‌లో ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తూ... రాష్ట్రంలో హేమంత్ సోరెన్ నేతృత్వంలోని ప్రభుత్వం దుష్పరిపాలన పట్ల ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని ఆరోపించారు. జార్ఖండ్ ముక్తి మోర్చా నాయకురాలు కల్పనా సోరెన్ ఖుంటిలో బహిరంగ సభలో మాట్లాడారు.

హేమంత్ సోరెన్ ప్రభుత్వ హయాంలో అనేక అభివృద్ధి ప్రాజెక్టులు పూర్తయ్యాయని చెప్పారు. కాంగ్రెస్, RJD, AJSU, వామపక్ష పార్టీల నాయకులు కూడా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎన్నికల ర్యాలీలలో ప్రసంగించారు. 81 మంది సభ్యులున్న అసెంబ్లీకి ఈ నెల 13, 20 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనుండగా, నవంబర్ 23న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

**PREZ-VIGILANCE WEEK**

రేపు న్యూఢిల్లీలో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సివిసి) అవగాహన వారోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. భారత తొలి హోం శాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా విజిలెన్స్ అవగాహన వారోత్సవాన్ని ప్రతి సంవత్సరం CVC నిర్వహిస్తుంది. ఈ సంవత్సరం, దేశ శ్రేయస్సు కోసం సమగ్రత సంస్కృతి అనే ఇతివృత్తంతో అక్టోబర్ 28 నుండి నవంబర్ 3 వరకు ఈ వారోత్సవాన్ని పాటించారు. ఈ సందర్భంగా, విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ 2024పై తపాలా శాఖ ప్రత్యేక కవర్ ను, మూడు బుక్‌లెట్ లను విడుదల చేయనున్నారు.

**SC-RECRUITMENT:**

ప్రభుత్వ ఉద్యోగ నియమకాల్లో నియమ, నిబంధనలను మధ్యలో మార్చలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నియామక ప్రక్రియలో ముందుగా నిర్దేశించిన నిబంధనలను మధ్యలో మార్చడం సాధ్యం కాదని ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదురుగు న్యాయమూర్తుల ధర్మాసనం పేర్కొంది. ఎంపిక నింబంధనలు ఏకపక్షంగా ఉండకూడదని, రాజ్యాంగంలోని 14వ అధికరణకు అనుగుణంగా ఉండాలని ధర్మాసనం తెలిపింది. ప్రజా నియమాక ప్రక్రియలో పాదర్శకత, నిస్పక్షపాతం ప్రధానంగా ఉండాలని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది.

**NITI-MSME:**

దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు **MSME** నుంచి సుమారు 40 శాతం ఎగుమతులు జరుగుతున్నాయని నీతి ఆయోగ్ సిఈవో బివిఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... **MSME** లు ఎదుర్కొనే మూలధనం, నిబంధనలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి సవాళ్ల గురించి ఆయన ప్రముఖంగా మాట్లాడారు. ఈ సవాళ్లను పరిష్కరించేందుకు  ఎలక్ట్రానిక్స్, ఆటో కాంపోనెంట్స్ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు నీతి ఆయోగ్ పనిచేస్తుందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి గురించి ఆయన మాట్లాడుతూ... మౌళిక సదుపాయలలో పెట్టుబడులు, మూలధన వ్యయం దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించాయని సుబ్రహ్మణ్యం అన్నారు.

**INDIA-BHUTAN**

అస్సాం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఈరోజు తమల్‌పూర్ జిల్లాలో భూటాన్ ప్రధానమంత్రి లియోంచెన్ దాషో షెరింగ్ టోబ్‌గే సమక్షంలో దర్రంగా ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్ ను ప్రారంభించారు. ఈ చెక్ పోస్ట్ భారతదేశం, భూటాన్ మధ్య పరస్పర సంబంధాలను ప్రోత్సాహిస్తుంది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... భారతదేశం, భూటాన్ మధ్య పరస్పర స్నేహం, సహకారానికి ఇది సరైన సమయం అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గరీటా, అస్సాం యాక్ట్ ఈస్ట్ పాలసీ వ్యవహారాల మంత్రి చంద్ర మోహన్ పటోవారీ కూడా తదుతరులు పాల్గొన్నారు.

**KTR:**

ఫార్ములా ఈ-రేస్ కుంభకోణంలో మాజీ మున్సిపల్ శాఖ మంత్రి, బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావుపై విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

నుంచి అనుమతి కోరింది. లండన్ కు చెందిన రేస్ నిర్వాహకులకు 55 కోట్ల రూపాయలు ముందుగా చెల్లించిన అవకతవకలపై అవినీతి నిరోధక శాఖ దర్యాప్తు చేస్తోంది.

## MEETING-ZAMBIA-INDIA

జాంబియాలోని లుసాకాలో జరిగిన జాంబియా-భారత్ సంయుక్త శాశ్వత కమిషన్ 6వ సెషన్‌కు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్, జాంబియా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ములాంబో హైంబే సహ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయం, విద్య, ఇంధనం, రక్షణ, సంస్కృతితో సహా వివిధ రంగాలలో సహకారాన్ని ఇరువురు నేతలు సమీక్షించారు. ద్వైపాక్షిక సంబంధాలలో పెరుగుతున్న వేగాన్ని ఇరుపక్షాలు కూడా ప్రశంసించాయి. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి వున్నామని పునరుద్ఘాటించారు. జాంబియాలో కొనసాగుతున్న కరువు పరిస్థితిపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. జాంబియాకు 2,500 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న లను సహాయం అందించడానికి అందిస్తున్నట్లు తెలిపింది.

## PM-CHHATH GREETINGS

ఛట్ పూజ పండుగ మూడో రోజైన ఈరోజు దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఛట్ సంధ్య అర్ఘ్య పండుగ - సరళత, సంయమనం, సంకల్పం, అంకితభావానికి ప్రతీక అని సామాజిక మాధ్యమంలో నరేంద్రమోదీ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు, శ్రేయస్సు, సౌభాగ్యాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు.

## CANCER DAY:

ఈరోజు దేశ వ్యాప్తంగా జాతీయ క్యాన్సర్ అవగాహనా దినోత్సవం పాటించారు. క్యాన్సర్ నివారణ, దాన్ని ముందస్తుగా గుర్తించడం, చికిత్స మొదలైన అవగాహన

కల్పించాలానే లక్ష్యంతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. కాగా క్యాన్సర్ చికిత్సలో కీలక పాత్ర పోషించే రేడియం, పోలోనియం ఆవిష్కరణల ఫ్రెంచ్ రసాయన శాస్త్రవేత్త మేరీ క్యూరీ పుట్టినరోజు కూడా ఈరోజే. ఈ సందర్భంగా - మున్సిపల్ క్లినిక్ లు, ప్రభుత్వ ఆసుపత్రులు, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం - CGHS ఆసుపత్రి ద్వారా - ఈరోజు - ఉచిత వైద్య పరీక్షలు జరిపించుకోవడం మొదలైన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా - ఈరోజు Srinidhi Educational Group సహకారంతో - 2(T) NCC Battalion - Secunderabad లో - నిర్వహించిన కార్యక్రమంలో - క్యాన్సర్ వల్ల కలిగే నష్టాలను వివరించడంతో పాటు ఆరోగ్యవంతమైన జీవన విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## J&K: KILLED

జమ్మూ డివిజన్‌లోని రియాసి జిల్లాలో ఈరోజు వాహనం అదుపుతప్పి లోయలో పడిపోవడంతో బాలుడితో సహా నలుగురు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ముగ్గురు అక్కడికక్కడే మరణించారని, గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించారని మా కరస్పాండెంట్ తెలియజేస్తున్నారు. కాగా, గాయపడిన ముగ్గురిలో ఒకరు ఆసుపత్రిలో గాయాలతో మరణించారు. మృతులంతా రియాసి జిల్లా మహోర్ తహసీల్ నివాసులు.